


# బదులు కోరని ఉత్తరం

—రాప్తాడు గోపాలకృష్ణ

నైట్ డ్యూటీ ముగించుకొని ఇంటికొస్తున్నాను.

రోడ్డు మలుపు తిరిగేచోట సరిగ్గా ఒక ఆర్.టి.సి. బస్ అడ్డొచ్చింది. ట్రాఫిక్ పలచబడిన రోడ్‌లో రాంగ్‌సైడ్ వెళ్ళయినా సరే క్రాస్ చేసేవాణ్ణి- బస్ వెనుక అంటించిన పోస్టర్‌లోని ఫోటో నన్ను కట్టి పడేసింది.

సైకిల్ స్లోగా డ్రైవ్ చేస్తూ బస్సు వెనకాలే వెళ్తున్నాను.

పోస్టర్‌లోని అక్షరాల్ని చదివాను.

శరీరం షాక్ తిన్నట్టయింది. తలలో ఏదో రీల్ గిర్రున ముందుకూ వెనక్కూ తిరిగింది.

ఆ ఫోటో అచ్చం నేను ఆల్బంలో పదిలంగా దాచుకున్న ఫోటోనే.

ఆ ఫోటో ఇన్నాళ్ళూ నేను, వెదికి వెదికి అలసిపోయిన నా స్నేహం......నా ప్రాణం..... సందీప్‌ది.

నా సందీప్ ఇక లేడు. వాణ్ణి ఎన్‌కౌంటర్లో చంపేశారు.

బాలన్స్ తప్పాను. సడన్ బ్రేక్ వేసి సైకిల్ దిగాను.

శరీరాన్ని అదుపులోకి తెచ్చుకొని ముందుకి చూస్తే- దుమ్ము లేపుకుంటూ నాకు చాలా దూరంగా వెళ్ళిపోతోంది బస్సు. కానీ ఆ ఫోటో నా కళ్ళముందే వుండిపోయింది. ఫోటోనే కాదు, సందీపే నా ఎదురుగా వచ్చి నిలబడినట్లయింది. శరీరం గగుర్పొడిచింది. ఏదో నీరసం ముంచుకొచ్చింది. నీళ్ళు నిండిన కళ్ళనుండి లోకం పారదర్శకంగా కనిపిస్తోంది. నా శరీరంలో ఏదో పుటుక్కున తెగిపోయినట్టు బాధ.

యూనివర్సిటీ హాస్టల్లో నేనూ, సందీప్ ఒకే గదిలో వున్నాం. ఒకే మంచం మీద పడుకున్నాం. ఒకే దుప్పటి కప్పుకున్నాం. ఒకే వూపిరి పీల్చాం. ఒకే కలను కన్నాం.

పరీక్షల ఆఖరిరోజు హాస్టల్ ఖాళీచేస్తూ, విడిపోలేక విడిపోలేక చివరికి ఇద్దరం వాటేసుకుని ఎంతగా యేడ్చుకున్నాం!

సందీప్ చాలా తెలివైనవాడు. క్లాస్ ఫస్ట్. ఇంగ్లీషు చదువు తున్నప్పటికీ వాడికి తెలుగు సాహిత్యం అంటేనే అభిరుచి ఎక్కువ. ఏ పుస్తకం మీద చూసినా మంచి కొటేషన్ రాసుకునేవాడు. ఎంత కలుపుగోలు మనిషో! ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా అర్థం చేసుకునేవాడు.

గట్టిగా హారన్ వినిపించింది. వులికిపడి చూశాను. రోడ్డు నడిమధ్యన నడుస్తున్నాను. సిగ్గుతో పక్కకి వచ్చాను.

"తాగుబోతు నాయాలు......" ఏవో మాటలు లీలగా వినిపించాయి. జీపు వెళ్ళిపోయింది. ప్రభుత్వ వాహనం.

ఎవరి మీదనో తెలియని కోపం కట్టలు తెంచుకొంది. పళ్ళు బిగుసుకున్నాయి.

ఇంటి కెలా వచ్చానో తెలీదు. నా గదిలోకి ఎలా వచ్చానో తెలీదు. అంతా ఒక అపస్మారక స్థితి.

గబగబా నా పాత డైరీ, ఫోటో ఆల్బమ్ తీశాను.

13–5–94 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

తెలుగు కళాసమితి మ్యాజర్సీ-రాజాలక్ష్మి ఫౌండేషన్‌వారికి కార్టూన్ల పోటీలో బహుమతి పొందిన కార్టూన్




ఆత్రంగా ఆల్బమ్ పేజీలు తిప్పాను. ఆ ఫోటో నేను కొన్ని క్షణాలు చూస్తుండిపోయాను. సందీప్ నా కళ్ళలోకి కళ్ళుపెట్టి చూస్తున్నట్లుంది. అలాగే సూటిగా చూస్తూ కన్నీరు మున్నీర య్యాను. పిచ్చిగా ముద్దాడాను.

'సందీప్......సందీప్' అంటూ ఏవో ప్రకంపనాలు నన్ను చుట్టుముట్టినట్లయింది.

వాడు రెండేళ్ళ క్రితం చివరి సారిగా రాసిన ఉత్తరాన్ని వొణుకుతున్న చేతుల్తో డైరీనుండి తీసాను.

ఆ అక్షరాల వెంబడి కళ్ళు పాకుతూ, సెనవేసుకుంటూ వెళ్ళాయి.

డియర్ గోపీ,

నీవొక నిరుద్యోగివి అయినందుకు సంతోషంగా వుంది. నీ నుంచీ నాలుగు వుత్తరాలు అందుకున్నాను. ఇప్పటికీ అవి జేబులోనే వున్నాయి. నా గుండె శబ్దాన్ని వింటూనే వున్నాయి. ఎప్పటికప్పుడు బదులు రాయాలని అనుకుంటున్నాను. నేనే నీ దగ్గరికి వద్దామనుకున్నాను. నేను నా చేతుల్లో వుంటేగా వచ్చేందుకు! కాన్వెంట్ స్కూల్లో నా జీవితం ప్రైవేటైజ్ అయిపోయిందిరా. రోజుకి ఆరు గంటలు పాఠాలు చెప్పాలి, ఎవరయినా లీవ్‌లో వుంటే ఏడవ పీరియడ్ కూడా. సాయంకాలం శరీరం ఇంటికి వస్తుంది. కానీ, మనసంతా స్కూల్లోనే వుంటుంది. రేపు బోధించాల్సిన పాఠం ప్రిపేర్ కావటం, టెస్ట్ పేపర్స్ దిద్దటం, కాంపోజిషన్ కరెక్ట్ చేయటం, ప్రోగ్రెస్ రిపోర్టు రాయటం....ఇలా ఏదో వొక పనితో పదకొండు కొడుతుంది. శెలవు రోజుల్లో కూడా పబ్లిక్ ఎక్జామ్ రాసే పిల్లలకి స్పెషల్ క్లాసెస్, రెమెడియల్ క్లాసెస్. నేను చూస్తుండగానే ఈ స్కూలు కొట్టాల నుంచీ మిద్దెలకీ, మిద్దెల నుంచీ మేడలకీ ఎదిగింది. నేనిప్పుడు ఓ యంత్రాన్ని, నెలకు కేవలం వెయ్యి రూపాయలు అద్దె పుచ్చుకునే ఎం.ఏ ఫస్ట్‌క్లాస్ యంత్రాన్ని.

ఉన్నట్టుండి ఏ పిల్లాడి తాతగారో కరెస్పాండెంట్‌కి ఫోన్ చేస్తాడు- మీ స్కూల్లో స్టాండర్డ్ ఇంగ్లీషు బోధించడం లేదని. ఇక అంతే. నిన్న గాక మొన్న ఓపెన్ యూనివర్సిటీలో బి.ఏ పాసైన మా కరస్పాండెంట్ ముందు నేను తల దించుకోవాల్సిందే.


ఆకస్మాత్తుగా వొక తల్లిగారు వూడిపడి "మా పాపకి ఇంగ్లీషులో మాట్లాడటం రాదు. ఫలానా స్కూల్లో చదివే పిల్లలు ఎంత బాగా మాట్లాడతారని! సంవత్సరానికి రెండువేల రూపాయల ఫీజు దండగ మీకు" అని రాద్ధాంతం చేస్తుంది.

అప్పుడు గూడా నేను కరస్పాండెంట్ ముందు గొర్రెలా నిలబడక తప్పదు. వాడు మహా గర్విష్టి. పేరెంట్స్ ముందు టీచర్స్ నోరు మెదపడానికి వీల్లేదు. ఏమైనా కారణాలు వివరిద్దా మంటే ఈ వుద్యోగం కూడా వూడిపోతుందనే భయం. ఇప్పుడు నేను గవర్నమెంట్ జాబ్‌కి అప్లై చేయటం లేదు. అసలు ఆఫర్సే లేవు. వొకటీ అరా వున్నా రికమెండేషన్స్, డబ్బు కుమ్మరించడం నాకు చేతకాదు, మనసు వొప్పదు. భవిష్యత్తు నన్ను కుంగదీస్తోంది గోపీ.

ఇక ఇంటి సంగతి- నాలుగ్గోడల మధ్య నలుగురం వుంటున్నాం అన్న మాటేగానీ, ఒకొక్కరి మధ్య కొన్ని వేల మైళ్ళ దూరం. కొన్ని రోజుల క్రితం నీకొక వుత్తరం రాశాను గుర్తుందా? వొకసారి తిరగబడి గట్టిగా అరిచేసరికి నాన్న నిరంకుశత్వం అంతా పటాపం చలైందనీ, ఇప్పుడు భక్తి మార్గంలో నడుస్తున్నాడనీ. ప్రస్తుతం పరిగెడుతున్నాడురా గోపీ. నుదుటి మీద కుంకుమ, మెడలో రుద్రాక్ష మాల, సాయంకాలాలు కాషాయ పంచెతో ఏదో వొక గుడిలో ధ్యానంలోనో, భజనలోనో! సారాయి నిషేధించి ఐ.ఎం.ఎఫ్.ఎల్ తెచ్చుకున్నట్టయింది పరిస్థితి. ఇంటి సంగతి ఏమీ పట్టించుకోడు.

నాన్నను నిరంకుశత్వ పిశాచం వదిలిందని సంతోషించాను. ఇంట్లో శాంతిపూరితమైన వాతావరణంలో వుండొచ్చు అనుకున్నాను. నాన్నను వదిలిన పిశాచం అమ్మను ఆవహించింది. హఠాత్తుగా తనకు సంక్రమించిన అధికారాలు ఎక్కడ పోతాయేమోనని కొంచెం అహంకారం పెంచుకుంది. ఇన్నాళ్ళూ అమ్మకీ, నాకూ వున్న సన్నిహితత్వం ఇప్పుడు లేదని చెప్పడానికి నాపై నాకే జాలి. వొక మాదిరి గిల్టీ కాన్షియస్‌నెస్‌తో అమ్మ బయటికి రాకుండా వుండేది గదా! ఇప్పుడూ అంతే. కానీ, నాన్నతో కొట్లాడే పనిగానీ, కుళ్ళుతూ కుమిలిపోయే అవసరం కానీ లేదు కదా. ఆ సమయమంతా 'జీ' టి.వితో కాలక్షేపం. డైనింగ్ టేబిల్, ఫోమ్ కుర్చీలు అమర్చటమే కాదు అమ్మ ఇప్పుడు టి.విలో వచ్చే తెలుగు నాటికల భాష సాధన చేస్తోంది. నాన్న భయం చేతనో, మరో కారణం చేతనో పొయ్యి మీద పాలు కూడా పొంగిపోయింది లేదని చెప్పావా! ఇప్పుడు జీవితాలే పొంగిపోతున్న శబ్దం 'జీ' టి.వి. శబ్దంలో అమ్మ వినలేకపోతోంది. ఏమీ చేయలేని తనం, దిక్కుతోచని స్థితి నన్ను నలిపేస్తున్నాయి గోపీ.

తమ్ముడికీ, చెల్లెలికీ నేనో పాత కాలం మనిషిని. తమ్ముడు టెన్త్ రెండవసారి తప్పాడు. చెల్లెలు ఇంటర్ మొదటిసారి మాత్రమే తప్పింది. దానికెప్పుడూ కాస్మెటిక్స్ పిచ్చి. నిన్న వేసిన



## 'అన్న' కోసమే!

డా. రాజశేఖర్‌కి తెలుగునాట అద్భుతమైన ఫాలోయింగ్ వుంది. ఆయన పేరు మీద డాక్టర్ కాబట్టి ఓ ఆరోగ్య మాసపత్రిక వస్తున్న విషయం గూడా తెలిసిందే. డా. రాజశేఖర్ తమ్ముడు చంద్రశేఖర్ తమిళనాడులో ఓ స్థాయి హీరో. తమ్ముడు కూడా అన్నలాగే అక్కడ ఏక్షన్ చిత్రాల స్పెషలిస్ట్. కానీ ఇప్పుడు తెలుగు, తమిళ భాషల్లో నిర్మితమవుతున్న 'గ్యాంగ్ మాస్టర్'లో మాత్రం సాఫ్ట్ కేరెక్టర్ శ్రీ చంద్రశేఖర్‌ది.

"ఎందుకనిలా?" అని అడిగితే-

మా 'అన్న' రాజశేఖర్ ఎటూ ఈ చిత్రంలో యాంగ్రీ టైప్ కేరెక్టర్ చేస్తున్నారు. నేను కూడా అదే టైప్ అయితే బాగోదుకదా. అందుకే అన్న కోసం సాఫ్ట్ కేరెక్టర్ అంగీకరించాను" అన్నారు చంద్రశేఖర్.

-- రవి కాలికివూడి



## కలిసొచ్చిన కాంబినేషన్

సెన్సేషనల్ హీరో సుమన్ నంది అవార్డు హీరో 'బావ-బావమరిది' చిత్రం ద్వారా అయిన విషయం తెలిసిందే. అయితే ఆ చిత్రంలో సుమన్ బావగా రెబల్ స్టార్ కృష్ణంరాజు నటించిన విషయం కూడా విదితమే.

అయితే ఇప్పుడు వీరిద్దరూ కలసి పి.ఎన్. రామచంద్రరావు దర్శకత్వంలో రూపొందుతున్న 'లీడర్' చిత్రంలో నటిస్తున్నారు. మరీ చిత్రానికి కూడా అవార్డు వస్తుందా?

'వస్తుంద'నే అంటున్నారు పి.ఎన్. రామచంద్రరావు. మా హీరో సుమన్‌కీసారి కూడా మా చిత్రంలో నంది అవార్డు వస్తుంది. అంతటి పెర్‌ఫార్మెన్స్ వున్న కేరెక్టర్ ఆయనది" అన్నారు.

ఏమో...కాంబినేషన్ కూడా అదే కాబట్టి వచ్చినా రావచ్చు. అసలే పరిశ్రమలో సెంటిమెంట్స్ ఎక్కువ.

– రవి కొలికిపూడి

గోళ్ళ రంగు ఈరోజు గీకేసి, మళ్ళీ కొత్తది వేస్తుంది. ఐబ్రోస్ కట్ చేసి పెన్సిల్ గీత పెడ్తుంది. ఆకాశంలో విహరించే నవలలు పొద్దస్తమానం చదువుతుంటుంది.

తమ్ముడు ఇంత లావు బుగ్గలతో ముద్దుగా వుంటాడని అనేవాడిని. ఇప్పుడు నీవు వాణ్ణి గుర్తు పట్టలేవు. ఇంత లూజు బ్యాగీ పాంట్, భుజాల మీద పడే జుట్టు, ఎప్పుడూ సినిమాలు. ఇదీ వాని స్థితి. నీవు ప్రెజెంట్ చేసిన చెరబండరాజు ఫోటో బైట గదిలో తగిలించుకున్నాను గుర్తుందా? ఇప్పుడది అక్కడ లేదు. మైకేల్ జాక్సన్ ఆక్రమించాడు.

అంతా సినీ భాష. సినీ సంస్కృతి. ఇంట్లో అరక్షణం కూడా వుండబుద్ధి కాదు. ఇంట్లో వుంటే పెనం మీద వున్నట్లు వుంటుంది. స్కూలుకి పోతే పొయిలో పడినట్లు వుంటుంది. ఏదో ప్రవాహంలో కొట్టుకు పోతున్న ఈ నగరంలో మంచి స్నేహితుడి కోసం గాలించి గాలించి విసిగిపోయాను. ఒంటరిగా ఎన్నిసార్లు భోరున యేడ్చుకున్నానో లెక్కలేదు. మనిషికీ మనిషికీ మధ్య మాటల్ని ప్రసారం కాకుండా ఏదో దుష్టశక్తి మన మధ్య వివిధ రూపాల్లో వాలుతోంది. 'ఏవో కనిపించని దారాల్తో మనల్ని కట్టిపడేసి తెరమీద ఆడిస్తోంది. పోగొట్టుకున్న జీవితాన్ని గురించి ఆలోచించే అవకాశం లేకుండా మన మధ్య శూన్యాన్ని నింపుతోంది.

అసలు 'జీవితం' అంటే ఏమి? అనే ప్రశ్న నన్ను వెంటాడుతోందిరా గోపీ. ఎందుకు వెంటాడదు చెప్పు ఇరవై తొమ్మిదేళ్ళ శరీరం తిలకించిందీ, పులకించిందే ఏముంది?

గోపీ! చివరికి ఇలా అంటున్నందుకు బాధగానే వుంది. ఈ వుత్తరానికి నీవు బదులు 'రాయనక్కరలేదు'. రాసినా అందుకోటానికి నేనుండను. నన్ను వెంటాడుతున్న, వేధిస్తున్న ప్రశ్నకి సమాధానం కోసం వెళ్ళిపోతున్నా. ఈ ఇంటి నుంచీ, ఈ కృతకమైన సంస్కృతి నుంచీ దూరంగా వెళుతున్నా.

మీ ఆవిడకి నమస్కారాలు. పాపకి బోల్డన్ని ముద్దులు.

నీ

సందీప్.

కళ్ళనెవరో పొడిచినట్టు కన్నీళ్ళు జలజలా రాలిపోయాయి. ఆ కన్నీళ్ళ మధ్యనే, బస్సుమీద ఎర్ర అక్షరాలతో వున్న పోస్టర్ కనిపిస్తోంది. ఆ అక్షరాలను ఒక్కొక్క దాన్నీ గాఢంగా స్పర్శిస్తున్నట్టుగా.....

"సందీప్ అమర్ హై!" అంటూ పెదవులు అప్రయత్నంగా వుచ్చరించాయి.

*

# బాబా చెప్పిన కథలు



## ఆశ్రితుల రక్షణ

స్వామి మనకు ఇదివరకే చెప్పియున్నారు. భగవంతుడు తన భక్తుల కోసం ఏమైనా చేస్తాడు, సంకోచించడు అని! ఈ విషయాన్నే తెలియచేస్తూ మరో కథ చెవుతారు.

పాండవులు వనవాసం చేస్తూ రోమ ఋషి వనంలో వున్నారు. ఆ ఋషి శరీరమంతా రోమమయం. ఆ అడవిలోనే 'ఋష్యశృంక' వృక్షం వుండేది. దాని ఫలము భుజించినవారికి ఇక ఆకలిదప్పులుండవు. అయితే ఆ ఫలాన్ని అందుకోడానికి కొన్ని నియమాలు వున్నాయి. ఆ ఫలమును ఎవరూ కోయ కూడదు. చెట్టునుంచి క్రిందకు రాల్చకూడదు. దానంతట అదే పండి, రాలిన తరువాతనే భుజించాలి. ఆ ఫలం ఎంతో అందంగా వుంటుంది. పైగా వనమంతా సువాసనలను వెదజల్లుతూ వుంటుంది.

ఒకరోజు ఆ ఫలమును, దాని విశిష్టతను చూసిన ద్రౌపది ధర్మజుని ప్రేరేపించింది 'ఆ ఫలమును మనం ఆర్గురం ఆరగించవచ్చు'కదా అని. ఇక్కడ మరో విషయం వుంది. రోమ మహర్షికూడా ఆ ఫలం భుజించాలని దానికోసం తపస్సు చేస్తున్నాడు. ఈ విషయం పాండవులకు తెలియదు. ధర్మజుడు భార్యచేత ప్రేరేపింపబడినవాడై బాణంతో క్రిందకు రాల్చి, ఎంతో ఆశతో దానిని అందుకోబోయాడు. అది అలా ఎంత కదిలించినా కొంచెం కూడా కదలలేదు. అలా నకుల- సహదేవులు ప్రయత్నించి విఫలమై తిరిగి పర్ణశాలకు వెళ్ళి అర్జునినితో చెప్పారు. అతను కూడా విఫలం అయ్యాడు. అప్పుడు భీముడు వాళ్ళను వెదుక్కుంటూ వచ్చి అతను కూడా ప్రయత్నించాడు. లాభం లేకపోయింది. ఇంతలో ఈ విషయం వనమంతా పాకింది. రోమమహర్షి రోమాలు నిక్కపొడుచుకున్నాయి. విషయాన్ని గ్రహించాడు. ఎవరో ఫలాన్ని దొంగిలిస్తున్నారని కోపంతో బయలుదేరాడు.

ద్రౌపదికి, పాండవులకు అప్పటికికాని విషయం అర్థంకాలేదు. రానున్న ప్రమాదాన్ని పసిగట్టారు. ఇక కాపాడవలసింది కృష్ణుడేకదా. ద్రౌపది, పాండవులు కృష్ణుని ప్రార్థించారు. క్షణాల్లో శ్రీకృష్ణ భగవానుడు వచ్చాడు. జరిగిన విషయం ద్రౌపది చెవుతూ, "నీవే తప్ప మమ్ములను రక్షించేవారు లేరు" అంటూ వాపోయింది!

అప్పుడు కృష్ణుడు రోమమహర్షి ఆశ్రమానికి చేరుకున్నాడు. ఆయన్ను చూడగానే రోమమహర్షి "నా ఆశ్రమాన్ని ఇన్నాళ్ళకు పావనం చేశావా" అంటూ సాష్టాంగ నమస్కారం చేశాడు. ఇద్దరూ కలసి మాట్లాడుకుంటూ బయలుదేరారు. అలా మాటల్లో పాండవుల ఆశ్రమం చేరుకున్నారు. అక్కడ కృష్ణుడు పాండవులకు ఒక్కసారిగా సాష్టాంగ నమస్కారం చేశాడు. చెప్పినున్న ప్రకారం వారు అందుకు ఏమి మాట్లాడకుండా కూర్చున్నారు. శ్రీకృష్ణుడే నమస్కారం చేశాడని వారు ఎంత గొప్పవారో అనుకుంటూ మహర్షి కూడా సాష్టాంగ నమస్కారం చేశాడు. ఆ నటనసూత్రధారి చర్యవల్ల రోమమహర్షి కోపం పూర్తిగా పోయింది. శ్రీకృష్ణుడు వారు సత్యవాక్యపరిపాలకులని ఋషికి పరిచయం చేశాడు. చెట్టు నుంచి పండును రాల్చింది కూడా వారేనని చెప్పాడు. సంతుష్టుడైన రోమమహర్షి ఆ ఆనంద సమయంలో తన కోపతాపాలను పూర్తిగా మరచిపోయి ఋష్యశృంక ఫలాన్ని వారు సంతోషంగా అనుభవించవచ్చునని చెప్పటమే కాకుండా స్వయంగా తన చేతులతో తానే ఆ ఫలాన్ని వారికి ఇచ్చాడు. అలా దానిని ఆరగించిన పాండవులు, ద్రౌపది ఆకలిదప్పులు లేకుండా మిగతా అరణ్యకాలాన్ని తేలిగ్గా గడపగలిగారు. చూశారా భక్తరక్షణకోసం తాను సాష్టాంగపడటానికి కూడా భగవంతుడు వెనుకంజవేయడు అంటారు శ్రీ సత్యసాయి. *